‘శిథిల’ భవనం

- పెచ్చులూడుతున్న తహసీల్దార్ కార్యాలయం
- భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు


శిథిలావస్థలో మావల తహసీల్దార్ కార్యాలయం

ఆదిలాబాద్‌రూరల్: పరిపాలన సౌలభ్యం కోసం అప్పటి ప్రభుత్వం 2016లో ఉమ్మడి ఆదిలాబాద్ మండలాన్ని మూడు మండలాలుగా విభజించారు. అందులో ఆదిలాబాద్ రూరల్, మావల, ఆదిలాబాద్ అర్బన్ మండలాలుగా ఏర్పాటు చేశారు. అయితే ఆదిలాబాద్ రూరల్, మావల మండలలకు కైలాస్‌నగర్‌లోని ప్రభుత్వ భవనాలను కేటాయించారు. అయితే మావల మండల తహసీల్దార్ కార్యాలయానికి కేటాయించిన భవనం ఇరుకుగా ఉండడంతో పాటు శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుందోనని కార్యాలయ ఉద్యోగులు బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వరిస్తున్నారు.

పెచ్చులూడి పోతున్నాయి..

వర్షాకాలం వచ్చిందంటే చాలు శిథిలావస్థకు చేరుకున్న మావల తహసీల్దార్ కార్యాలయం స్లాబ్ పెచ్చులూడి ఉద్యోగులతో పాటు వివిధ పనుల కోసం కార్యాలయానికి వెళ్లినా ప్రజలపై పడడంతో పాటు వర్షం నీరు కార్యాలయంలోకి వస్తున్నాయి. గత ఏడాది సైతం వర్షాకాలంలో స్లాబ్ పెచ్చులూడి పడిన సందర్భాలు ఉన్నాయి. అంతేకాకుండా వర్షపు నీరుతో విలువైన ఫైల్స్ తడిసే ప్రమాదం ఉందని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని..

మావల తహసీల్దార్ కార్యాలయ భవనం సుమారు గత 40 నుంచి 50 ఏళ్ల కిందట నిర్మించిన భవనం కావడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఎప్పుడైనా స్లాబ్ కూలి ప్రమాదం జరిగే పరిస్థితి ఉందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. భయంతో విధులు నిర్వర్తించాల్సి వస్తుందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా

ప్రస్తుతం తహసీల్దార్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. తమకు మరో భవనం కేటాయించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన్నాం. అందులో భాగంగానే రెండు భవనాలను పరిశీలించాం. భూ భారతి సదస్సులు కొనసాగుతున్నందున ప్రస్తుతం ఉన్న భవనంలోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నాం. సదస్సులు ముగియగానే నూతన భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని మారుస్తాం.

– వేణుగోపాల్, తహసీల్దార్, మావల

క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలలో చేరండి


ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో చేరాలని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ కళాశాలకు నూతన భవనం, పూర్తిస్థాయి అధ్యాపకులు, విశాలమైన ఆటస్థలం ఉందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ విఠల్ కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు జయరాజ్, రవి, అనిల్, నగేశ్, అనిల్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం


ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సీఐ

ఇచ్చోడ: పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం విజయవంతంగా ముగిసిందని ఇచ్చోడ సీఐ బండారి రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులకు వివిధ రకాల క్రీడల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందచేశారు. ఎస్సై పురుషోత్తం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి


సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏఎస్పీ కాజల్‌సింగ్

నార్నూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని ఏఎస్పీ కాజల్‌సింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఏజెన్సీలో నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అనంతరం పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో భాగంగా కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మాస్టర్ తిరుమలేష్‌ను సత్కరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకోవాలన్నారు. సీఐ రహీంపాషా, సిబ్బంది పాల్గొన్నారు.

జైనథ్ మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


ప్రచురితమైన విద్యార్థుల కథలు

జైనథ్: జైనథ్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. హైదరాబాద్‌కు చెందిన బాల సాహిత్య వేదిక ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను కథలు రాయడంలో ప్రోత్సహిస్తుంది. ఉత్తమ కథలను ఎంపిక చేసి తమ వేదిక ఆధ్వర్యంలో ప్రతీ నెలా బాలబాట కథల సంచికను ప్రచురిస్తుంది. ఇందులో భాగంగా గత నెలలో ప్రచురించిన మాస పత్రికలో పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థులు బి.నందిని, కే. ఖుషి కుమారి, ఐశ్వర్యరెడ్డిలు రాసిన కథలు ఈర్ష్య, కల్మషం లేని మనుషులు, చెప్పుడు మాటలు శీర్షికలతో ప్రచురితమయ్యాయి. దీంతో సదరు విద్యార్థులను తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. పిల్లలు కథలు రాయడంలో ప్రోత్సహించిన సత్యం, తెలుగు ఉపాధ్యాయుడు భోజన్నలను పాఠశాల హెచ్‌ఎం రాములు అభినందించారు.

చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: మహిళ రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళిని రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం సమాఖ్య ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ వాటిని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. మహిళలకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2వేల పెన్షన్ ఇవ్వాలని, దివ్యాంగులు, ఆసరా పెన్షన్‌ను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా కార్యదర్శి అమీనా, వెంకటమ్మ, షాహీన్, కాంతబాయి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి


సూచనలు చేస్తున్న ఏజెన్సీ అదనపు వైద్యాధికారి

ఇంద్రవెల్లి: వర్షాకాలంలో ప్రజల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి కుడ్మేత మనోహర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు సంభవించే అవకాశం ఉందన్నారు. రోడ్డు సౌకర్యం లేని గ్రామాల్లో గర్భిణులను, దీర్ఘకాలిక రోగులను గుర్తించి ముందస్తుగా ఆరోగ్య కేంద్రానికి తరలించి బర్త్ వేటింగ్ రూంలో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, పూజిత, నిలోఫర్, హెల్త్ సూపర్‌వైజర్ సురేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నారాయణ రెడ్డి జయంతి


నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణ రెడ్డి 118వ జయంతిని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సొంత భూములను పంచి పోరాటానికి పిలుపునిచ్చారని కొనియాడారు. నిజాం ప్రభుత్వ ఆగడాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని, సుమారు 10 లక్షల ఎకరాలను కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పంచి పెట్టి చరిత్ర సృష్టించాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ముడుపు నళిని రెడ్డి, అమీనా ఖాన్, కుంటాల రాములు, ఎస్.అరుణ్ కుమార్, ఖండాల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

సాత్నాల: పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ కళాశాల ఆదిలాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని కాన్ప మెడిగూడ గ్రామంలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పంట సాగులో రైతులు అధిక మోతాదులో రసాయన ఎరువులు, ఎరువులు వినియోగించకూడదని సూచించారు. ఎరువులు, పురుగుల మందుల కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. పొలం గట్లపై చెట్లను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. విత్తనాలు, మందులు కొనుగోలు సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.మంజులత, ఎస్.కిరణ్ రెడ్డి, ఏవో పూజ, ఏఈవో ఆనంద్, సీఈవో శాలిక్ రావ్, రైతులు పాల్గొన్నారు.

బ్రాండ్ లిక్కర్ నో స్టాక్

- సిండికెట్‌గా ఏర్పడి కొరత సృష్టిస్తున్న మద్యం వ్యాపారులు



బ్రాండ్ లిక్కర్ లేని వైన్‌షాప్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వైన్స్ దుకాణాల్లో గత కొన్ని రోజుల నుంచి బ్రాండ్ లిక్కర్ దొరకడం లేదు. దీంతో ఆ మద్యం బ్రాండ్ తాగే మందుబాబులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలో నాలుగు వైన్స్‌షాపులు యజమానులు సిండికెట్‌గా ఏర్పడి కృతిమ కొరత సృష్టిస్తున్నట్లు ఆరోపణలు విని పిస్తున్నాయి. కొన్ని రోజుల కిందట పెరిగిన మద్యం. ధరలతో వైన్స్‌షాపుల యజమానులు బ్రాండ్ లిక్కను స్టాక్ ఉండడం లేదు. ఇతర మద్యంను విక్రయిస్తు భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. విషయంపై ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్‌ను ‘సాక్షి’ వివరణ కోరగా వైన్స్‌షాపుల యజమానులు డిమాండ్ ఉన్న మద్యం మాత్రమే అందుబాటులో ఉంచుతారని, బ్రాండ్ మద్యం అందుబాటులో లేని విషయం తమకు తెలియదని సమాధానం ఇచ్చారు.

సాగుకు సమాయత్తం


ఈ ఏడాది ముందస్తు వర్షాలతో పాటు నైరుతి సైతం ముందుగానే పలకరించనున్నట్లు వాతావరణశాఖ ప్రకటనతో అన్నదాతలు సాగుకు సమాయాత్తమయ్యారు. తొలకరి జల్లులకే పనులు షురూ చేశారు. తలమడుగు మండలం కజ్జర్ల శివారులో ఓ రైతు చేలో విత్తనాలు విత్తుతుండగా కనిపించిన దృశ్యమిది. – సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

‘పోలీసుసైరన్ ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు’

ఆదిలాబాద్‌టౌన్: ప్రైవేట్ వాహనాలకు పోలీసు సైరన్‌లు, అధిక శబ్దం చేసే మోడిఫైడ్ హరన్‌లు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి హెచ్చరించారు. డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాహనదారులు చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే వాహనాల సీజ్‌తో పాటు కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. పట్టణంలో ఇటీవల పోలీసు సైరన్‌ను అనధికారికంగా అమర్చినట్లు గుర్తించి ఓ ప్రైవేట్ వాహనాన్ని సీజ్ చేశామన్నారు. అలాగే వాహనదారుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చట్టాలను గౌరవించాలని, ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా ఉండాలని సూచించారు. ఎక్కడైనా చట్టవిరుద్ధ చర్యలు గుర్తించిన పక్షంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

ఉచిత శిక్షణకు జైనథ్ విద్యార్థి ఎంపిక

జైనథ్: హైదరాబాద్‌కు చెందిన ఋటా ధార పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ పరీక్షలో జైనథ్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థి శివ ప్రసాద్ ప్రతిభ కనబర్చాడు. ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు పరీక్ష నిర్వహించగా సత్తా చాటి ఉచిత శిక్షణకు ఎంపికయ్యాడు. జేఈఈ, నీట్‌లో ఉచితంగా కోచింగ్ ఇవ్వడంతో పాటు రూ.35వేల విలువైన పుస్తకాలను అందిస్తుందని పాఠశాల హెచ్‌ఎం రాములు, గైడ్ టీచర్ సత్యనారాయణ తెలిపారు.

నాణేల ప్రచారాన్ని నమ్మవద్దు

ఇచ్చోడ: మండలంలో కొంత మంది ప్రాచీన నాణేల పేరుతో మోసం చేస్తున్నారని, వారి నమ్మవద్దని ఇచ్చోడ సీఐ బండారి రాజు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన వ్యక్తి ప్రాచీన నాణేల ఉన్నాయని వాటిని విక్రయిస్తు డబ్బులు వసూలు చేస్తుండగా పట్టుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.


రేపటి వరకే జొన్న కొనుగోళ్లు

జైనథ్: జైనథ్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈనెల 6న వరకే జొన్న కొనుగోళ్లు చేయనున్నట్లు మండల పీఏసీఎస్ సెక్రటరీ గంగన్న ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వచ్చిన బండ్లను మాత్రమే లోపలకు అనుమతించడం జరుగుతుందన్నారు. రైతులు గమనించి తేమ లేని, ఆరబెట్టిన జొన్న పంటలను తీసుకురావాలని సూచించారు.

చెక్కు అందజేత

బోథ్: బోథ్ మండల కేంద్రానికి చెందిన నరంశెట్టి వైష్ణవి ఇటీవల సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. రూ. 18,500ల విలువ గల చెక్కును ఎమ్మెల్యే ఆదేశాలతో బీఆర్‌ఎస్ నాయకుడు మేడిచెల్మ ప్రవీణ్‌కుమార్ బుధవారం అందజేశారు.

అర్హులకు ఇళ్లు కేటాయించాలి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తాంసి: అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని గోముత్రి గ్రామస్తులు బుధవారం భీంపూర్ ఎంపీడీవో గోపాలకృష్ణా రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రెండో విడతలో భాగంగా గ్రామంలో మంజూర్ చేసిన 15 ఇళ్లలో అనర్హులకు కేటాయించినట్లు పేర్కొన్నారు. భూమిలేని ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు తుడి రాకేశ్, సర్పే దళిత్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి

తలమడుగు: భూ సమస్యల పరిష్కరం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. బుధవారం మండలంలోని ఉమ్రీ, అర్లి(కె) గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. రైతులను భూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భూభారతి చట్టంలో రైతులకు భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భూభారత చట్టం తీసుకువచ్చిందన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రైతులు చేసుకున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఉమ్రి, అర్లి(కె) గ్రామాల్లో 22 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌మోహన్, ఆర్‌ఐ రోహిదాస్, డీటీ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: భూభారతి చట్టంలో భాగంగా భూ సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సులు మండలంలో కొనసాగుతున్నాయి. బుధవారం కేస్లాగూడ, దేవాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రైతుల వ్యవసాయ భూము సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఆర్‌ఐ మెస్రం లక్ష్మణ్, సిబ్బంది రాజు, వెట్టి అచ్‌పత్‌రావ్ పాల్గొన్నారు.

బోథ్: బోథ్, సొనాల మండలాల వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. బోథ్ మండలంలోని కౌఠ(బి) గ్రామంలో తహసీల్దార్ సుభాష్ చందర్, సొనాల మండంలోని గొల్లాపూర్ గ్రామంలో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌లు రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. భూభారతి చట్టాన్ని ప్రజలకు వివరించారు. భూ సమస్యలపై పలు దరఖాస్తులను స్వీకరించారు.

సాత్నాల: భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సు కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఆర్డీవో వినోద్ కుమార్ అన్నారు. మండలంలోని డౌన గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాస్‌బుక్‌లో సర్వే నంబర్ లేకపోవడం, పేర్ల సవరణ, వారసత్వ పంపకాలు, తదితర సమస్యలు ఏమైనా ఉంటే త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. తహసీల్దార్ విశ్వనాథ్, ఎంపీడీవో వెంకట్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలో గేర్జం, దాబా(కె) గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. బుధవారం గేర్జంలో తహసీల్దార్ సత్యనారాయణరావు, దాబా(కె)లో డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రమేశ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, దరఖాస్తులు స్వీకరించారు.

నేరడిగొండ: భూభారతితో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ ఎంఏ కలీమ్ అన్నారు. బుధవారం మండలంలోని లింగట్ల, వెంకటాపూర్ గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. దీర్ఘకాలిక భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు భూభారతి సదస్సులు వేదికగా పని చేస్తున్నాయన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు


భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: మండలంలో అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఇచ్చోడ, గేర్జం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి 516 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు.

ప్రొసీడింగ్ పత్రాల అందజేత

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. ఎంపీడీవో మోహన్ రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. అనంతరం పలువురి లబ్ధిదారుల ఇళ్ల పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నజీర్, పంచాయతీ కార్యదర్శి నరేశ్, సంతోశ్, మహేందర్, నారాయణ పాల్గొన్నారు.

భీంపూర్‌లో..

భీంపూర్ మండలంలోని గుబిడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి ప్రారంభించారు. అలాగే గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి విజయ్, ప్రవీణ్, ఇస్తారి, అరవింద్ పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎంపీడీవో రాజ్‌వీర్, పంచాయతీ సెక్రటరీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రొసిడింగ్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. గ్రామాభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడం కేశవ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ అర్బన్ ఎంఈవో సోమయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈనెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని, పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సకాలంలో పాఠ్య పుస్తకాలు అందించడంతో పాటు మధ్యాహ్న భోజనం, యూనిఫాం, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఉపాధ్యాయుల కొరత, బోధనేతర సిబ్బందిని నియమించాలని కోరారు. వైశాలి, శైలజ, కరుణాకర్, నందిని పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజ నిర్మాణానికి కృషి


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జైనథ్: క్షయ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా.సుమలత అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జైనథ్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా 60 మందికి చెస్ట్ ఎక్స్ రే పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రతి నెలా న్యూట్రిషియన్ కిట్స్‌ను ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.నైనత, సూపర్ వైజర్ వేణు, ఎఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అందుబాటులో ఉంటాం

- ఎస్పీ అఖిల్ మహాజన్


పార్థిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న సబ్‌ఇన్‌స్పెక్టర్ కుట్టే శివాజీ మంగళవారం సాయంత్రం రిమ్స్ ఆస్పత్రిలో మృతిచెందారు. విషయ తెలుసుకున్న ఎస్పీ బుధవారం స్థానిక సంజయ్‌నగర్‌లో గల ఆయన నివాసానికి చేరుకున్నారు. ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. అంతిమ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి, టూటౌన్ సీఐ కరుణాకర్ రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.